క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

జాబ్ మేళాకు 26 మంది హాజరు



రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్ఐసీ, డక్స్ బిజినెస్ సొల్యూషన్, ఆక్రో సాఫ్ట్ సొల్యూషన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాకు 26 మంది అభ్యర్థులు హాజరు కాగా, 15 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్, ప్రిన్సిపల్ టీసీ రవిచంద్ర, స్కిల్ క్లబ్ కో–ఆర్డినేటర్లు రవికుమార్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీ శ్రీనివాసరెడ్డికి అభినందన

భట్టిప్రోలు: కేరళలో ఫిబ్రవరిలో జరగనున్న మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఐలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డి అర్హత సాధించడంతో సోమవారం ఆయనను పలువురు అభినందించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీడీవో ఎస్.వెంకట రమణ, ఎంఈవో నీలం దేవరాజు ఆయనను ఘనంగా సన్మానించి, అభినందించారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ 6 పదుల వయస్సు దాటినా పోటీల్లో పాల్గొని, బాపట్ల జిల్లాకు పేరు తీసుకువచ్చిన శ్రీనివాసరెడ్డి పలువురికి ఆదర్శనీయమన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివ కృష్ణ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కొండేటి బాల కృష్ణ, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ కుమారి, టైపిస్ట్ నిఖిల్ పాల్గొన్నారు.

టీఎంరావు పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్



భట్టిప్రోలు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహద పడతాయని స్టేట్ రీ–సోర్స్ పర్సన్ (ఎస్ఆర్పీ) గుర్రం మురళీ మోహన్ పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో స్థాయిలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఆర్పీ మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోగాలు చేస్తూ నేర్చుకోవడం వల్ల అవగాహన శక్తి సామర్థ్యాలు పెరుగుతాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, మురళీధరరావు, సుబ్బారావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ట్రెజరర్‌గా కోట బ్రహ్మయ్య



బాపట్ల: బులియన్ అసోసియేషన్ సభ్యులు కోట బ్రహ్మయ్య బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ట్రెజరర్‌గా ఎన్నిక కావడం అభినందనీయమని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బొమ్మిశెట్టి హరినాథ మురళి పేర్కొన్నారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం బ్రహ్మయ్యను సన్మానించారు. ఎడ్యుకేషన్ సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బ్రహ్మయ్య పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వెదురుపర్తి లక్ష్మణమూర్తి, సెక్రటరీ దొడ్డ రామకృష్ణ, ట్రెజరర్ నాళం నరేష్, జాయింట్ సెక్రెటరీ మొదడుగు నరేష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నో స్టాక్..!

- వేమూరు మండలంలో యూరియా కొరత
- మూడు పరపతి సంఘాల్లో నిల్వలు నిల్
- ఎరువుల దుకాణాల్లోనూ అదే పరిస్థితి
- అత్యవసరమైతే..అధిక ధర తప్పనిసరి
- ఇతర మండలాల్లో అందుబాటులో ఎరువు



పాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

వేమూరు: మండలంలో యూరియా కొరతతో రైతులు నానావస్థలు పడుతున్నారు. వేమూరులో మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడింటికీ ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ ప్రత్యేక అధికారులు ఎరువులు తీసుకురావడంలో చేతులెత్తేశారు. మండలంలో 12 ఫెర్టిలైజర్ దుకాణాలున్నాయి. ఇక్కడ కూడా యూరియ కొరత ఉంది. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 20 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ఇందులో 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 5 వేల ఎకరాల్లో జొన్న పంటలను రైతులు సాగు చేశారు. మినుము, పెసర పంటలు కూడా సాగవుతున్నాయి. జొన్న, మొక్కజొన్న పంటలకు ఎక్కువగా యూరియా వినియోగిస్తారు. రైతులు ఫెర్టిలైజర్ దుకాణాలకెళ్తే.. యూరియా లేదన్న సమాధానమే వస్తోంది. లేదంటే యూరియా బస్తా రూ.350లు చెబుతున్నారు. దీంతో స్థానిక రైతులు ఇతర మండలాలకెళ్లి యూరియా కొనుగోలు చేస్తున్నారు. సహకార పరపతి సంఘాలకు యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇక్కడే కొరత ఎందుకు..

వేమూరు నియోజకవర్గంలోని ఇతర మండలాల్లోని ఎరువుల దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో యూరియా రైతులకు అందిస్తున్నారు. వేమూరు మండలంలో మాత్రమే యూరియా కొరత ఏర్పడిందని రైతులు చెబుతున్నారు.

యూరియా కొరత



మొక్కజొన్న పంట 20 ఎకరాల్లో సాగు చేశాను. యూరియా లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాను. సహకార పరపతి సంఘాల్లో, ఎరువుల దుకాణాల్లో యూరియా స్టాకు లేదు.
– వి.జక్రయ్య, రైతు, వేమూరు

కొరత లేకుండా చూడాలి



మండలంలోని మూడు సహకార సంఘాల్లో ఎరువుల స్టాకు ఏర్పాటు చేయాలి. ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.
– దాసరి యాకోబు, రైతు, వేమూరు

కొరత ఉంది

మండలంలో యూరియా కొరత ఉంది. రెండు రోజుల్లో మండలంలోని అన్ని దుకాణాలకు యూరియా సరఫరా చేస్తాం.
– చందోలు సునీత, ఏఓ, వేమూరు

క్విజ్ పోటీల్లో బాపట్ల విద్యార్థుల సత్తా

భట్టిప్రోలు: కౌశల్ 2024 క్విజ్ పోటీల్లో బాపట్ల జిల్లా విద్యార్థి బృందం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. సోమవారం విజయవాడ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఏపీ సైన్స్ సిటీ, భారతీయ విజ్ఞాన మండలి సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు.
బాపట్ల జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థుల బృందం ప్రథమ స్థానం సాధించింది. రూ. 15 వేలు నగదు బహుమతి కైవశం చేసుకుంది. భట్టిప్రోలు మండలం పెసర్లలంక, పిట్టలవానిపాలెం మండలం చందోలు, బల్లికురవ మండలం కొప్పెర్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్స్‌కు చెందిన మోర్ల తేజశ్రీ,, బీబీ బషీర్, బత్తుల అభిరామ్ ఈ ఘనత సాధించారు. జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం, జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాదిక్, కౌశల్ కో–ఆర్డినేటర్లు పి. పూర్ణ చంద్రరరావు, పి. భానుచంద్రమూర్తి, భట్టిప్రోలు ఎంఈవోలు నీలం దేవరాజు, పెసర్లంక హెచ్ఎం ఎస్‌కె మహబూబ్ బాషా, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పోటీలలో నెల్లూరు, నంద్యాల జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి.

ఐకమత్యంతో పనిచేయాలి

వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



సమన్వయకర్త ఈవూరి గణేష్‌ను సత్కరిస్తున్న వాసు

రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వాసుమల్ల వాసు సోమవారం పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ గణేష్‌ను శాలువాతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ఐకమత్యంతో పనిచేయాలని వాసుకు గణేష్ సూచించారు. అలాగే రేపల్లె మండలం మోర్తోట పంచాయతీ కనగాలవారిపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోలా వర్మ ఇటీవల రహదారి ప్రమాదానికి గురయ్యారు. సమాచారం తెలుసుకున్న డాక్టర్ గణేష్ వర్మను కలిసి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని హామీనిచ్చారు.

ఉపాధి హామీ పథకం లక్ష్యాలు సాధించాలి



పాల్గొన్న డ్వామా పీడీ విజయలక్ష్మి

రేపల్లె రూరల్: ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధిస్తూ గ్రామాల్లోని కూలీలకు పని దినాలు కల్పించాలని డ్వామా పీడీ విజయలక్ష్మి కోరారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో సోమవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. చేసిన పనులపై ఏటా సామాజిక తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడితే శాఖ పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు దుర్వినియోగం చేసిన సొమ్మును రికవరీ చేయడం జరుగుతుందన్నారు. 2023–24లో రేపల్లె మండలంలో రూ.11 కోట్లు విలువ చేసే 1,800 పనులు జరిగాయన్నారు. పనుల్లో ఎటువంటి అవకతవకలు లేవని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ చంద్రసువార్త, ఎంపీడీవో ఎం.శోభారాణి, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పెంటర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అధికారి ప్రభాకర్‌రావు, జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్స్ (వడ్రంగి) అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను సోమవారం భట్టిప్రోలులో రేపల్లె సహాయ కార్మిక శాఖాధికారి జి. ప్రభాకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ ఏటా అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాలెండర్లను ముద్రించి కార్మికులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్పెంటర్లు ఐక్యతతో హక్కులు సాధించుకునే దిశగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కె. శ్రీనివాసరావు, కార్పెంటర్స్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ల పరిశుభ్రత తప్పనిసరి

కమిషనర్ జి.రఘునాథరెడ్డి



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల: వాటర్ ప్లాంట్ల వద్ద పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సూచించారు. సీనియర్ వాటర్ ఎనలిస్ట్ గుంటూరుకు చెందిన వి.రాజారావుతో కలిసి సోమవారం వాటర్ ప్లాంట్లు తనిఖీ చేశారు. నీటి నమూనాలు సేకరించారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. అన్ని శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. వాటర్ బాటిల్స్‌లో నీరు నింపి అమ్మకాలు చేయరాదని సూచించారు. కమిషనర్‌తో పాటు డీఈ కృష్ణారెడ్డి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనం సమస్యలను అక్షర బద్ధం చేసిన శ్రీశ్రీ



డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

బాపట్ల: జననాడిని, సామాజిక ముఖ చిత్రాన్ని వచన కవిత్వంలో చొప్పించి వర్తమాన కాలంలోని అన్ని రకాల పరిణామాలను అక్షర బద్ధం చేసిన ఘనత శ్రీశ్రీ కి దక్కుతుందని ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి పేర్కొన్నారు. నెల నెలా నందివర్ధనం తరతరాల తెలుగు పలుకు 96వ కార్యక్రమం ఆదివారం రాత్రి బాపట్ల మండలం వెదుళ్ళపల్లిలోని వివేక సర్వీస్ సొసైటీ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ... భావ కవిత్వం, చందస్సు సహిత పద్య కవిత్వం మాత్రమే సాహిత్యంగా విశ్వసించే రోజుల్లో, వచన కవిత్వం కూడా గొప్ప సాహిత్యమేనని, జనాదరణ పొందగలదని నిరూపించిన అభ్యుదయ కవుల్లో శ్రీ శ్రీ ప్రముఖులన్నారు. అభ్యుదయ కవిత్వంలో నూతన ఒరవడిని తీసుకువచ్చి జనం భావావేశాలను, పీడితుల వాణిని, తిరుగుబాటు పోరాట స్ఫూర్తిని కూడా పొందుపరచిన దిగంబర కవుల కవిత్వం తనదైన విశిష్టతను సొంతం చేసుకుందని నరసింహారెడ్డి వివరించారు. వివేకా సర్వీసెస్ సొసైటీ అధ్యక్షులు ఎన్వీవీ నాగరాజు, కార్యదర్శి అంబటి మురళీ కృష్ణ, ధృతి కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం, సమన్వయ కర్త శీలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ముఖ్యవక్త ఏనుగు నరసింహారెడ్డిని ఘనంగా సత్కరించారు.

ద్విచక్ర వాహనదారుడి మృతి

వేమూరు: కొల్లూరు నుంచి వెల్లబాడుకు ద్విచక్ర వాహనంపై నుంచి పండి మాతంగి కిరణ్ (20) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వెల్లబాడు గ్రామానికి చెందిన కిరణ్ కొల్లూరు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. వెల్లబాడు వద్ద బైక్ స్లిప్ కావడంతో పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో గుంటూరు ప్రభుత్వం ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ఎస్ఐ రవికృష్ణ సోమవారం తెలిపారు. గుంటూరు ప్రభుత్వ వైద్య శాలలో బ్రెయిన్ ఆపరేషన్ చేశారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. పోస్టుమార్టం చేసి, మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు.

రైతులకు రీ సర్వేపై అవగాహన



అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం భూముల రీసర్వే చేస్తోందని డిప్యూటీ తహసీల్దారు ఎం.శివయ్య తెలిపారు. అమర్తలూరు మండలంలోని కోరు తాడిపర్రు గ్రామంలో రీ సర్వేపై గ్రామ సభ సోమవారం నిర్వహించారు. భూములు రీ సర్వే చేయడం వల్ల రైతుల సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



పేరలిపాడు(కర్లపాలెం): పూర్వీకుల జ్ఞాపకార్థం ట్రస్ట్ ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని బుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు అన్నారు. పేరలిపాడు గ్రామంలో కాగిత కుటుంబ సభ్యులు కాగిత బ్రదర్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్‌గా కాగిత వరప్రసాద్, కార్యదర్శిగా కాగిత సుందర్‌దాస్, ట్రెజరర్‌గా కాగిత సముయేలును నియమించుకున్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. పాస్టర్ వి.ఏసుపాదం, డాక్టర్ జి.చార్వాక, ఆనందకుమార్, మణిభూషణ్, సుందర్‌దాస్ ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల కృషి



రేపల్లె రూరల్: పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు భాగస్వాములు కావాలని కమతం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కమతం సాంబశివరావు అన్నారు. మండలంలోని పిరాట్లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన సరస్వతిదేవి విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించి, పూర్వ విద్యార్థులను అభినందించారు. అనంతరం పూర్వవిద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రస్టీ కమతం విజయకుమారి, సర్పంచ్ కమతం రమాదేవి, మాజీ సర్పంచ్ మండలి రామమోహనరావు, చెన్నుపల్లివారిపాలెం సర్పంచ్ ముత్తిరెడ్డి జయరామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు



అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ సుందరమ్మ

రేపల్లెరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు పలు సమస్యలపై అర్జీలు అందజేసినట్లు వివరించారు. పీఎం కిసాన్, రైతు భరోసా మంజూరుకు నిజాంపట్నం మండలం ప్రజ్ఞంకు మిరియాల వజ్రమ్మ, భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామం ఇందిరానగర్ కాలనీలో ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఆక్రమణల తొలగింపునకు నన్నేపాముల చంద్రశేఖర్, ఓలేరు నుంచి గౌడపాలెం రహదారి కిరువైపులా ఆక్రమణలు లేకున్నా.. ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానికులు, సాగుచేసుకునేందుకు సాగు భూమిని ఇప్పించాలని భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామానికి చెందిన వాగోలు రమేష్, తన కోళ్ల పాకను తొలగించాలని మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని చోడాయపాలేనికి చెందిన సముద్రాల పవన్ బాబు అర్జీ అందించినట్లు తెలిపారు. చోడాయపాలెంలో పవన్‌బాబు కోళ్లఫారం వ్యర్థాలతో ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారిందని, దుర్గంధం వస్తోందని గ్రామస్తులు అర్జీ అందించారన్నారు. ప్రభుత్వ డొంక రోడ్డును సర్వే చేసి ఆక్రమణను తొలగించాలని కొల్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన తాళ్లూరి కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారని, సమస్యలను పరిశీలించి ఆయా శాఖల అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

గణపవరం(కర్లపాలెం): భూముల సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సుందరమ్మ చెప్పారు. గణపవరం గ్రామంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. గ్రామ సభలో రైతుల నుంచి 17 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. త్వరితగతిన అర్జీలు పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. సర్పంచ్ దేవరకొండ అంకమ్మ, ఎండోమెంట్ అధికారి రవికుమార్, ఆర్ఐ రాజేంద్ర, వీఆర్వో ఎ.శివారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



బస్టాండ్ సెంటరులో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కొల్లూరు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖలను సీపీఎం, ప్రజా, దళిత సంఘాల నాయకులు ఖండించారు. సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం కొల్లూరు ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ ప్రభుత్వాలకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం, దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ వ్యవస్థలో మంత్రిగా మంత్రిగా పనిచేస్తూ అహకార పూరిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించడంతోపాటు, ఎంపీ పదవి నుంచి సైతం భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, దళిత సంఘాల నాయకులు టి. సురేష్, బి. సుబ్బారావు, కూచిపూడి మోషే, అమర్తలూరి రమేష్, ఆళ్లమూడి మదుసుధాకర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు –సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లెరూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయటం కేంద్ర మంత్రి అమిత్ షాకు తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. ఇటీవల అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వామపక్షాలు పిలుపు మేరకు సీపీఎం ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటరులో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమిత్ షా అంబేడ్కర్ పేరును ఉచ్చరిస్తూ అహంకారపూరిత, అవమాన పూరిత వ్యాఖ్యలు చేయడం భారత రాజ్యాంగాన్ని తక్కువ చేయడమేనన్నారు. అమిత్ షాను వెంటనే పదవి నుంచి తొలగించడంతో పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, జై భీమ్ పార్టీ, ప్రజాసంఘాల నేతలు కె.ఆశీర్వాదం, కె.రమేష్, జె.ధర్మరాజు, జి.కృష్ణ ప్రసాద్, కర్రా బాబురావు, వెంకట్రావు, సుబ్బారావు, వై.నవీన్, యు.రామకృష్ణ పాల్గొన్నారు.

వామపక్షాల నిరసన

భట్టిప్రోలు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవమానపరచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్ షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం సాయంత్రం భట్టిప్రోలు చావలి బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు, సీపీఎం నాయకులు జి. సుధాకర్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

అమర్తలూరు(వేమూరు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు సీపీఎం నాయకులు బొనిగల అగస్టీన్ అన్నారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ అమిత్ షాను వెనకేసుకురావడం దుర్మార్గమన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ కూచిపూడి కార్యదర్శి పులివర్తి రాజు, చావలి రమేష్, కె శాంసన్, దేవర కొండ సతీష్, కె మోషే పాల్గొన్నారు.

రహదారికి అడ్డుగా వాహనాలు



భట్టిప్రోలు: సబ్ –రిజిస్ట్రార్ కార్యాలయం బజారులో రహదారికి అడ్డుగా వాహనాలు నిలుపుదల చేయడంతో వాహనదారులు, పాదచారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి నిత్యం ఈ రహదారి నుంచి స్థానికులు, ఆ ప్రాంత వాసులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. కార్యాలయానికి వచ్చే వారు రహదారిపై వాహనాలు నిలుపుదల చేయడంతో స్థానికులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. కార్యాలయం అధికారులు వాహనాలు నిలుపుదల చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకోతే.. ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూడాలని కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (వేమూరు, రేపల్లె)
90109 62225 (పొన్నూరు, బాపట్ల)
Office mail : sakshigntadvt@gmail.com